క్లుప్తంగా

కొండలమ్మ ఆలయంలో క్యూలైన్లు కిటకిట



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో క్యూలైనుల్లో భక్తులు అధిక సంఖ్యలోబారులు తీరారు. అమ్మవారికి భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం



మండవల్లి: గణపతి సచ్చిదానంద స్వామిజీ దివ్య ఆశీస్సులతో లక్ష్మీగణపతి హోమం శనివారం లోమూడి దత్తాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. నాగబాబు యాజ్ఞికత్వంలో ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్‌శంకర్ దంపతులతో వైభవంగా హోమం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ధనుంజయ్, గాదంశెట్టి మోహనరావు, హరిమోహన్, శివప్రసాద్, గుర్రం ప్రసాద్, మల్లి, దాసరి శివన్నారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రంగా జయంతిని విజయవంతం చేయండి



పామర్రు: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జూలై 4వ తేదీన జరిగే దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతిని జయప్రదం చేయాలని నిర్వాహకుడు ఆకుల శ్రీనివాసకుమార్ కోరారు. ఆదివారం పామర్రు గ్రామంలో రంగాకు అత్యంత సన్నిహితుడు, రాధారంగా మిత్రమండలి కన్వీనర్ దివంగత నేత తాడిశెట్టి నాగేశ్వరరావు తనయులకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పేద బడుగుబలహీన వర్గాలకు విశిష్టసేవలు అందించిన వ్యక్తి రంగా అన్నారు. ఆయన జయంతి వేడుకలను విజయవాడ నడిబొడ్డున నిర్వహిస్తున్నామన్నారు. పార్టీలకు అతీ తంగా అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పలువురు రంగా సన్నిహితులు, రాధా రంగా మిత్ర మండలి సభ్యులు తాడిశెట్టి మధుసూదనరావు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



మండవల్లి: మండలంలోని అల్లినగరంలో శనివారం డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రతి ఇంట్లో బీజామృతంతో విత్తనశుద్ధి నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ విత్తనశుద్ధి చేయడం ద్వారా భూమి నుంచి వ్యాపించే తెగుళ్ల నివారణ, మొలకశాతం అధికంగా రావడానికి అవకాం ఉందని తెలిపారు. ప్రతి రైతు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి నాగవిజయ, రైతులు పాల్గొన్నారు.

సాగర తీరాన్ని సందర్శించిన న్యాయమూర్తి

కోడూరు: హంసలదీవి సాగరతీరాన్ని అవనిగడ్డ కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ లంకా గోపీనాథ్ ఆదివారం సందర్శించారు. ప్రత్యేక వాహనంలో తీరానికి చేరుకున్న ఆయనకు పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు స్వాగతం పలికారు. కృష్ణమ్మ సాగరుడిని కలిసే పవిత్ర కృష్ణా సాగర సంగమ ప్రాంత విశిష్టతను న్యాయమూర్తికి వివరించారు.

నేటి నుంచి మచిలీపట్నం-రేపల్లె బస్ సర్వీస్

మచిలీపట్నం టౌన్: ప్రయాణికుల కోరిక మేరకు మచిలీపట్నం నుంచి రేపల్లెకు పల్లె వెలుగు బస్సు సర్వీసును సోమవారం నుంచి పునరుద్ధరించామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసు మచిలీపట్నం డిపో నుంచి ప్రతి రోజూ ఉదయం 7.10 గంటలకు, 11.10 గంటలకు, సాయంత్రం 5.10 గంటలకు బయలుదేరుతుందన్నారు. రేపల్లె నుంచి ఉదయం 9.15 గంటలకు, మధ్యాహ్నం 1.10 గంటలకు, ఐదు గంటలకు పల్లె వెలుగు సర్వీసు మచిలీపట్నంకు బయలు దేరుతుందని వివరించారు. ప్రయాణికులు వినియోగించు కోవాలని కోరారు.

కూలీలకు ఉపాధి దన్ను

- కూలీలను ఆదుకుంటున్న ఉపాధి పథకం
- కుటుంబ పోషణకు ఆసరా
- ఆధార్ అనుసంధానంతో అక్రమాలకు చెక్
- సత్ఫలితాలిస్తున్న ఎన్ఎంఎంఎస్ పద్ధతి
- నియోజకవర్గంలో 6,67,811 పనిదినాలు కల్పన



కైకలూరు మండలం దొడ్డిపట్లలో చెరువు తవ్వకం పనులు

కైకలూరు: గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సంజీవినిలా పనిచేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకం అమలులో పారదర్శకతను తీసుకురావడానికి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాయి. నేషనల్ మస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)ను ఈ ఏడాది జనవరి నుంచి అమలులోకి తీసుకొచ్చారు. దీంతో ఉపాధి పనుల్లో అక్రమాలకు చెక్ పడింది. రోజు వారి కూలీరేటును రూ.15 పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఎండలు తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటలలోపు పనులు చేసుకునే అవకాశం కల్పించారు. ఉపాధి పనుల కల్పనపై కూలీలు సంతోషం వ్యక్తం చేస్తోన్నారు.

నియోజకవర్గంలో..

కైకలూరు నియోజకవర్గం కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో మొత్తం ఉపాధి హామీ జాబ్‌కార్డులు 51,596 ఉన్నాయి. దీని ద్వారా 78,301 కుటుంబాలకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 6,67,811 పనిదినాలు ద్వారా మొత్తం రూ.17,35,40,000 కూలీల ఖాతాలకు జమ చేశారు. అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 23,189 కుటుంబాలకు 2,75,924 పనిదినాలు ద్వారా రూ.7,17,40,000 కూలీల రూపంలో అందించారు. వేసవి నేపథ్యంలో ఉదయం 10 గంటలకే పనిని ముగించుకునే వెసలుబాటు ప్రభుత్వం కల్పించింది.

సత్ఫలితాలిస్తున్న ఎన్ఎంఎంఎస్

కేంద్ర ప్రభుత్వం నేషనల్ మస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)ను ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి అమలు చేస్తోంది. నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ (ఎన్ఐసీ) టెక్నాలజీ ద్వారా ఇది పనిచేస్తుంది. ప్రారంభంలో మాన్యువల్ మస్టర్ ద్వారా హాజరు వేసేవారు. గతంలో 20 మంది కంటే ఎక్కువ మంది కూలీలు హాజరైతే ఆన్‌లైన్ నమోదు చేసేవారు. సంఖ్య తగ్గితే ఇది పనిచేయదు. ప్రస్తుత ఎన్ఎంఎంఎస్ విధానం ద్వారా సంఖ్యతో పనిలేకుండా ఒక కూలీ ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు చేయవచ్చు. రెండు సార్లు పని ప్రదేశంలో ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో గతంలో జరిగిన హాజరు నమోదు అక్రమాలకు చెక్ పడింది.

ఉపాధి పనులతో ఆర్థిక దన్ను..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రజలకు కోరుకున్న పనిదినాలను అధికారులు సమకూరుస్తున్నారు. గతంలో రోజు కూలీ రూ.257 ఉండగా దానిని రూ.272 పెంచారు. ప్రధానంగా ఉపాధి పనుల్లో 60 శాతం కూలీలకు అందిస్తుండగా మరో 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ (సామగ్రి) రూపంలో నాడు-నేడు పనులు, సచివాలయాలు ఇలా ప్రభుత్వ పనులకు ఉపయోగిస్తున్నారు. కైకలూరు నియోజకవర్గంలో ఆక్వా సాగు అధికంగా ఉంది. కొల్లేరు గ్రామాల్లో సైతం కిక్కిస తొలిగింపు పనులు చేపట్టారు. నియోజకవర్గంలో కాల్వ పూడిక పనులు, డ్రెయిన్లు, డొంకరోడ్లు మరమ్మతులు, చెరువుల తవ్వకం పనులు ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులు ఇలా..

మండలం	కుటుంబాలు	జాబ్‌కార్డులు	పనిరోజులు	చెల్లించిన మొత్తం
కైకలూరు	19,454	11,256	1,20.000	3,12,00000
కలిదిండి	17,261	17,261	1,33,634	3,47,00000
మండవల్లి	18,397	10,143	1,38,253	3,59,00000
ముదినేపల్లి	23,189	12,936	2,75,924	7,17,40,000
మొత్తం	78,301	51,596	66,7811	17,35,40,000

100 శాతం ఆధార్ అనుసంధానం



నియోజకవర్గం నాలుగు మండలాల్లో 100 శాతం జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానమయ్యాయి. ఎన్ఎంఎంఎస్ విధానం ద్వారా పాదర్శకంగా కూలీల ఖాతాలకు నగదు జమ అవుతోంది. ఢిల్లీ స్థాయిలో సర్వర్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఆక్వా ప్రాంతంలో డొంక రోడ్లను ఉపాధి పనుల్లో భాగంగా మరమ్మతులు చేయడం వల్ల ఆక్వా, వ్యవసాయ రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. ప్రభుత్వ చర్యలను ప్రజలు హర్షిస్తున్నారు.

– ఏ.శరణ్‌కుమార్, ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్, కైకలూరు

లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలి

జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాద్ రాజు



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ప్రసాద్ రాజు

గుడ్లవల్లేరు: గ్రాడ్యుయేషన్ అనేది విద్యార్థుల జ్ఞాన సముపార్జనకు ముగింపు కాకూడదని, విద్య అనేది జీవితంలో లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతర కృషి చేయాలని జేఎన్‌టీయూకే ఉప కులపతి డాక్టర్ జి.వి.ఆర్.ప్రసాద్ రాజు పేర్కొన్నారు. స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ స్నాతకోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసాద్‌రాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతనోత్తేజం నింపేందుకు ఏటా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించటం అభినందనీయమన్నారు. విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పత్రాలను అందజేశారు. తొలుత ఎన్ఎస్ఎస్ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్, సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, మెంటార్ డాక్టర్ బి.కరుణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండ రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని ప్రభావితం చేసే రచనలు రావాలి



సత్కారం పొందిన రచయితలతో అతిథులు, నిర్వాహకులు

చినముత్తేవి(మొవ్వ): సమాజాన్ని ప్రభావితం చేసే రచనలతో ముందుకు రావాలని మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ సూచించారు. మొవ్వ మండలం చినముత్తేవిలోని అభయ్ భవనంలో కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి నిర్వాహణలో రెండు రోజుల కథాకార్యశాల-2023 కార్యక్రమం ఆదివారం ముగిసింది. సమన్విత అధ్యక్షురాలు, కథా కార్యశాల కన్వీనర్ డాక్టర్ దుట్టా శమంతకమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. గురుజాడ, కందుకూరి వీరేశలింగం పంతులు తమ రచనలతో సంస్కరణ ఉద్యమాలను నడిపించారన్నారు. ఈ కార్యశాల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచే మంచి రచనలతో రచయితలు ముందుకు రావాలని బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. ఈ సభలో సమన్విత కార్యదర్శి శాంతిశ్రీ, సహాయ కార్యదర్శి వరప్రసాద్, పద్మ వడ్లమూడి, లక్ష్మి, గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. రచయితలను జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడిగా మురళీకృష్ణ



మురళీకృష్ణను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

కైకలూరు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా చొప్పెర్ల మురళీకృష్ణ ఎన్నికయ్యారు. అమ్మవారి దేవాలయంలో నూతన కమిటీకి సన్మాన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఉపాధ్యక్షుడిగా వరదా మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శిగా కొప్పర్తి గోపాలకృష్ణమూర్తి, కోశాధికారిగా సమయమంతుల వెంకటశ్యామల శివ బసవరాజా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా లక్కింశెట్టి మోహన్, పీఆర్‌వోగా ముప్పిడి సత్యనారాయణ, ఇతర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కమిటీ 2023-25 ఏడాది పాటు కొనసాగనుంది. నూతన అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

సాగరతీరంలో మెరైన్ పోలీసుల గస్తీ



పర్యాటకులకు సూచనలిస్తున్న మెరైన్ సిబ్బంది

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చారు. సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సందడి చేశారు. పర్యాటకులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా మెరైన్ సిబ్బంది గస్తీ చేపట్టారు. యాత్రికులకు సూచనలిస్తూ, సముద్ర పరిస్థితుల గురించి వివరించారు. సీఐ పవన్‌కిషోర్, ఎస్ఐ జిలానీ పర్యవేక్షణలో గస్తీ చేపట్టారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. దూరప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలుపోసి దర్శనం చేసుకున్నారు. పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద పలువురు దంపతులు పూజలు నిర్వహించారు. గోకులంలోని గోవులకు మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

మెకానిక్‌ల సంక్షేమానికి కృషి

గుడ్లవల్లేరు: మెకానిక్‌ల సంక్షేమానికి కృషి చేస్తామని బైక్ మెకానిక్‌ల వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ ధమినేని ధర్మ అన్నారు. గుడ్లవల్లేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బైక్ మెకానిక్‌ల వెల్ఫేర్ అసోసియేషన్ గుడ్లవల్లేరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యవర్గ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు హుస్సేన్, కార్యదర్శి ఫరీద్, కోశాధికారి ఉపేంద్ర తదితర సభ్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు

గూడూరు: మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. ఈ ఘటన గూడూరు సెంటర్‌లో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. కప్పలదొడ్డికి చెందిన కేశిరెడ్డి విఘ్నేశ్వరరావు భార్య పైడమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై గూడూరు మండలం ఐదుగుల్లపల్లిలోని తన కుమార్తె ఇంటికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి ఆదివారం సాయంత్రం బయలుదేరారు. గూడూరు సెంటర్లో కప్పలదొడ్డివైపు తన ద్విచక్ర వాహనాన్ని మలుపు తిప్పుతుండగా మచిలీపట్నం నుండి విజయవాడ వెళుతున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన పైడమ్మ అపస్మారక స్థితిలోకి వెళ్లగా విఘ్నేశ్వరరావు కాలికి గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో క్యూ లైన్లు అన్నీ నిండిపోయాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటిండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాగునీటి కాలువలకు జలకళ



మొవ్వ: ఖరీఫ్‌గా సాగు చేసే వరి పంట నారుమడుల కోసం, వెదసాగుకు అవసరాలకు నీటి పారుదల శాఖ సాగునీటిని సకాలంలో విడుదల చేసింది. దీనితో ఆదివారం భీమనది ఛానల్‌కు జలకళ వచ్చింది. పమిడిముక్కల మండలం వీరంకి సెక్షన్ నుంచి ప్రారంభమైన ఈ కాలువ మొవ్వ మండలం నుంచి ఘంటసాల మండలానికి చేరుకుటుంది. దీనికి తోడు శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం రైతన్నలకు వరంలా మారింది. సాగునీరు సకాలంలో రావటం, వాతావరణం అనుకూలంగా ఉండటంతో నారుమడులు పోసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు సాధ్యం



పురస్కారాలు స్వీకరించిన విద్యార్థులతో అతిథులు

- రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రదీప్ కుమార్
- 'పది'లో ప్రతిభ చూపిన 25 మంది ఎస్సీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

గుడివాడ రూరల్: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, అప్పుడే పేద ఎస్సీలకు సహాయం అందించి అంబేడ్కర్ వారసులు అవుతారని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్.ప్రదీప్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఐఎంఏ హాల్‌రోడ్‌లోని ఘంటసాల ఫంక్షన్ హాల్‌లో ఐఎఫ్ఎస్ మాజీ అధికారి కాకొల్లు బస్మాకరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 25 మంది ఎస్సీ విద్యార్థులకు నగదు పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ డీజీపీ టి.సునీల్‌కుమార్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, రాష్ట్ర మాజీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కంట్యాక్స్ అధికారి ఉప్పులేటి దేవిప్రసాద్, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి జూపూడి ప్రసాద్, తహసీల్దార్ డెక్కా రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ టి.సుధేష్ బాబులతో కలిసి ప్రదీప్‌కుమార్ ప్రోత్సహకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశానికి తన మేధస్సు ద్వారా సేవలందించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఈ స్థానంలో ఉన్నామన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. జిల్లా జైభీమ్ ఎస్సీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో 10వ తరగతిలో అత్యధికంగా మార్కులు సాధించిన 25 మంది ఎస్సీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేయడం అభినందనీయమన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు ప్రత్తిపాటి అద్భుతరావు, అధ్యక్షుడు కోడూరు కృష్ణారావు, జనరల్ సెక్రటరీ ఉప్పులేటి రారాజు, కోశాధికారి సింగవరపు మల్లిఖార్జునరావు, బండి గోవర్ధనరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ పట్టణాధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్ (ఫనీ), దారం ఉపేంద్ర, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం



కైకలూరు మండలం భుజబలపట్నంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గంలో సీసీ రోడ్లు నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గతంలో భుజబలపట్నంలో సందర్శించిన ఎమ్మెల్యే డీఎన్నార్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. అందులో భాగంగా సీసీ రోడ్డు ఏర్పాటుకు కొబ్బరికాయ కొట్టి పనులను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అత్యవసర పనులను గ్రామస్థాయిలో గుర్తించి పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సర్పంచి గురజాల రామతులసి, ఎంపీటీసీ సభ్యుడు పెన్మెత్స సూర్యనారాయణ రాజు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, ఉపసర్పంచ్ జంగం మోషే, వాసవి రవిరాజు, మండల కో-ఆప్షన్ సభ్యుడు సోమల శ్యామ్ సుందర్, పంచాయతీ రాజ్ డీఈ సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి డి.లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

శ్యామలాంబ అమ్మకు ఆషాఢ సారె



అమ్మవారికి అషాఢ సారె అందిస్తున్న సభ్యులు

కైకలూరు: ఆషాఢమాసం సందర్భంగా శ్యామలాంబ తల్లి, పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయానికి కైకలూరు శ్రీమన్నారాయణ గోష్ఠి అధ్యక్షురాలు సీహెచ్.హేమలత ఆధ్వర్యంలో ఆషాఢ సారెను ఆదివారం అందించారు. ఆలయ ఈవో వీఎస్‌కే.శేఖర్ గోష్ఠి సభ్యులకు స్వాగతం పలికారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

కోడూరు: ఆంజనేయుడి నామస్మరణతో నక్కవానిదారి గ్రామం పులకించింది. గ్రామంలో అవధూతేంద్ర భక్త సమాజం ఆధ్వర్యంలో 216వ సారి హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం ఆదివారం అభయాంజనేయుడి దేవాలయం వద్ద నిర్వహించారు. భక్తసమాజం ఆధ్వర్యంలో ఇప్పటివరకు వివిధ ప్రాంతాల్లో 215 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. తమ భక్తసమాజం సభ్యులతో చాలీసా పారాయణం జరిపించుకున్న వారిని ఆహ్వానించి సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందించారు. తొలుత స్వామి వారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.